## ద్రోణపర్వ కథాంశాలు

ఇందు 8 ఉపపర్వములు గలవు. 202 అధ్యాయాలు, 9742 శ్లోకాలు గలవు.

భీష్మపితామహుడు నేల కొరిగిన వార్తవిని ధృతరాష్ట్రుడు మిక్కిలి కలతచెందెను. అతనిని సంజయుడు సముదాయించెను. దుర్యోధనుడు కర్ణాది మహారథులతో మంతనములు జరిపి యథావిధిగా ద్రోణాచార్యుని సేనాపతి పదవి యందు అభిషిక్తుని చేసెను. దుర్యోధనుని ప్రసన్నుని చేయుటకు ద్రోణుడు దుర్యోధనుని వరము కోరుకొనుమని అడిగెను. అప్పుడు దుర్యోధనుడు, యుధిష్ఠిరుని పట్టి తీసుకువచ్చి నాకు అప్పగించవలసినది. నేను అతనిని తిరిగి ద్యూతమున ఓడించి పాండవులను వనమునకు పంపి నిష్కంటకముగ రాజ్యపాలన చేసెదను అనెను. "దుర్యోధనుని నికృష్టమగు ఆలోచనను తెలుసుకొన్న ద్రోణుడు ఖిన్నమనస్కుడై ఇట్లు పలికెను. దుర్యోధనా! అర్జునుడు యుద్ధభూమి యందు రక్షకునిగా యుధిష్ఠిరునితో కూడా లేకపోయినచో తప్పనిసరిగా అతనిని పట్టుకోగలను. అర్జునుడు రక్షకుడైనచో ఇంద్రుడు కూడా ఏమీ చేయలేడు.

యుద్ధము 11వ రోజున ద్రోణుడు శకట వ్యూహమును రచించగా పాండవులు క్రౌంచవ్యూహమును పన్నిరి. పాండవసేన ముఖద్వారము వద్ద శ్రీకృష్ణార్జునులుండిరి. ప్రతిజ్ఞను గూఢచారుల ద్వారా తెలుసుకొని యుధిష్ఠిరుడు ఆ వార్తను అర్జునునకు చేరవేసెను. అంత అర్జునుడు నా వద్ద గాండీవము ఉన్నంత వరకు ఎవ్వరూ ఏమీచేయలేరని ధైర్యమిచ్చి యుధిష్ఠిరుని నిర్భయముగా యుద్ధము చేయమని చెప్పెను. అర్జునుని మాటలకు ధైర్యమునొందిన యుధిష్ఠిరుడు నిర్భయముగ యుద్ధ భూమియందు తిరగసాగెను. ఇరుపక్షముల మధ్య భీకరమైనపోరు సాగెను. ద్రోణాచార్యుడు పాండవ సేనను, అర్జునుడు కౌరవసేనను చీల్చిచెండాడు చుండెను. శల్య భీమసేనుల యుద్ధము అనిర్వచనీయము. భీముడు శల్యుని రథసారథిని చంపుట వలన యుద్ధభూమి యందు నిలువ లేక శల్యుడు పారి పోయెను. కౌరవసేన హాహాకారములు చేసిరి. సూర్యాస్తమయమగుటచే ఆరోజు యుద్ధము నిలుపు చేయబడినది.

ఆ రోజున కౌరవసేన ఎక్కువ నష్టపోయెను. యుధిష్ఠిరుడు కూడా పట్టుబడకుండా పలుమార్లు తప్పించుకొనెను. ఇది చూసి దుర్యోధనుడు

ద్రోణునివద్దకు వెళ్లి పట్టుకోకుండా మీరెందుకు అతనిని విడిచి పెట్టితిరని ప్రశ్నించెను. దీనికి సమాధానముగా ద్రోణుడు `అర్జునుడు రక్షకుడుగా ఉన్నంత కాలము నేను యుధిష్ఠిరుని బంధించలేను.'
ఏదో విధముగ నీవు యుద్ధ భూమి యందు అర్జునుని దూరముగా తీసుకు వెళ్ళినచో తప్పక నేను యుధిష్ఠిరుని సులభముగా పట్టుకోగలనని చెప్పెను. అది విన్న సుశర్మ తన అయిదుగురు సోదరులతో కలసి యుద్ధభూమి నుండి అర్జునుని దూరముగా తీసుకు పోవుదునని పలికెను. సుశర్మ యుద్ధమునకై అర్జునుని ఉసిగొల్పెను. ఇది సహించలేని అర్జునుడు శ్రీకృష్ణునితో బయలుదేరి అతనితో యుద్ధము చేయదలచెను. అప్పుడు యుధిష్ఠిరుడు అర్జునుని `నీవు త్రిగర్తులతో యుద్ధము చేయుటకు వెళ్ళినయెడల ద్రోణాచార్యుని నుండి నన్ను ఎవరు రక్షించెదరు' అని అడిగెను. అప్పుడు అర్జునుడు 'సాత్యకి ప్రాణములతో నున్నంతకాలము ద్రోణాచార్యుడు మిమ్ములను ఏమియు చేయలేడు. సాత్యకి యుద్ధమున మరణించినట్లైతే మీరు యుద్ధమును విడిచి వెళ్ళిపోవలసినది' అని యుధిష్ఠిరునికి ధైర్యము చెప్పి త్రిగర్తులపైకి దండెత్తి వారిని యమలోకమునకు పంపెను. పిమ్మట అర్జునుడు తనరథమును భగదత్తుని వైపు మరల్చెను. అంతలో ద్రోణుడు విరాటుని సోదరుడు శతానీకుని, సత్యజిత్తు మున్నగు వీరులను చంపెను. సత్యజిత్తు మరణము వలన యుధిష్ఠిరుడు యుద్ధ భూమి నుండి వెనుదిరిగెను. అర్జునుడు భగదత్తుని ఆక్రమించగా అతడు అర్జునునిపై వైష్ణవాస్త్రము విడిచెను. అదిచూచి శ్రీకృష్ణుడు దానికి ఎదురువెళ్ళి అది తన వక్షఃస్థలమునకు తగులునట్లు చేసుకొనెను. శ్రీకృష్ణుడు భగదత్తుని చంపుటకు అర్జునుని ప్రేరేపించి అతని మృత్యు రహస్యమును చెప్పెను. భగదత్తుని మరణము వలన తిరిగి కౌరవసేనలో హాహాకారములు బయలుదేరెను. సూర్యాస్తమయమగుటచే ఆరోజు యుద్ధము ముగిసెను. శకుని సోదరుల మరణ వార్త విని దుర్యోధనుడు ఖేదపడెను.

తమసేన ఘోరపరాజయమునకు ఖిన్నుడైన దుర్యోధనుడు ఆరాత్రి ద్రోణుని వద్దకు వెళ్ళి అతనితో ఇట్లు పలికెను. ద్రోణాచార్యా! మీరు మమ్ములను శత్రువుగా చూచుచున్నారు. లేనిచో ఈరోజు మీరు యుధిష్ఠిరుని విడిచి పెట్టి ఉండేవారు కాదు. దుర్యోధనుని ఎత్తిపొడుపు

మాటలకు బాధపడిన ద్రోణుడు రేపు ఏదో విధముగ యుధిష్ఠిరుని పట్టుకొందును. కాని అర్జునుని యుద్ధభూమి యందు యుధిష్ఠిరుని నుండి దూరముగా తీసుకు వెళ్ళవలెను. అని పలికెను. సంశప్తకులు అర్జునుని రెచ్చగొట్టి దూరముగా తీసుకుని పోవుదుమని ప్రతిజ్ఞ చేసిరి. ప్రాతః కాలమున ద్రోణుడు చక్రవ్యూహమును రచించెను. ఇందలి ఏడు ద్వారములలో అగ్రభాగమున ద్రోణాచార్య జయద్రథులు నిలబడిరి. అర్జునుడు శ్రీకృష్ణుడు మినహా ఈవ్యూహమును ఎవ్వరూ భేదించలేరు. అర్జునుడు సంశప్తకులతో యుద్ధము చేయుటకు చాలాదూరము వెడలుటచే ఈవ్యూహమును ఎట్లు భేదించవలెనని యుధిష్ఠిరుడు చింతించెను. అంతట అభిమన్యుడు ముందుకు వచ్చి " ఈ వ్యూహమును భేదించి లోపలికి ప్రవేశించుట నాకు తెలుసు. తిరిగి బయటకు వచ్చు విధానము నాకు తెలియదు. నేను తల్లి గర్భంలో ఉండగా తండ్రి నాతల్లికి చక్రవ్యూహమును భేదించు విధానము చెప్పినారు. ఇంతలో నాతల్లి నిద్రపోవుటచే చక్రవ్యూహము నుండి తిరిగి వచ్చు విధానము చెప్పలేదు. కనుక మీరు చింతింపవలదు. చక్రవ్యూహమును భేదించి లోపలికి ప్రవేశించ గలను." అని పలికెను. అది విన్న యుధిష్ఠిరుడు ప్రసన్నుడై అభిమన్యునితో " హేపుత్ర! వ్యూహము భేదించుటయే కష్టము. వీరులంతా నీతోనే ఉందురు. నిన్ను సురక్షితముగా వ్యూహమునుండి బయటకు తీసుకురాగలరు" అని చెప్పెను. మిక్కిలి సంతసించిన అభిమన్యుడు ధనుస్సును శబ్దంచేస్తూ భీమ, ధృష్టద్యుమ్న, యుధిష్ఠిర, నకుల, సహదేవులతో చక్రవ్యూహమును భేదించుటకు బయలుదేరెను. అర్జునుని పదహారు సంవత్సరముల బాలసింహము గర్జిస్తూ ద్రోణాచార్యుని ఎదుటకు వచ్చెను. భీముడు ద్రోణాచార్యునితో భీకర యుద్ధము చేసి అతని రథమును దూరముగా విసిరి వేసెను. మార్గము సుగమమగుటచే అభిమన్యుడు ముందుకు సాగెను. అభిమన్యుని అడ్డుకొనుటకు జయద్రథుడు శతవిధముల ప్రయత్నించి నిష్ఫలుడాయెను. కాని జయద్రథుడు తన వర ప్రభావమును భీమసేనాదులను లోపలికి పోనీయకుండా నిలుపుచేసెను.

అభిమన్యుని మార్గమునకు అవరోధము కల్గించిన వారెవరు బ్రతికి బయట పడలేదు. ఆసమయమున అతనిని అడ్డగించుటకు ద్రోణాచార్య,

అశ్వత్థామ, కర్ణ, కృపాచార్యులు అక్కడికి వచ్చిరి. అందరూ కలసి అభిమన్యునితో యుద్ధము చేయుట ప్రారంభించిరి. అభిమన్యుని పరాక్రమము ముందు. కర్ణ,ద్రోణాదులు నిలువలేక పోయిరి. దుర్యోధనపుత్రుడు లక్ష్మణుడు అభిమన్యునిచే చంపబడగా క్రుద్ధుడైన దుర్యోధనుడు ద్రోణునివద్దకు వచ్చి విలపిస్తూ ఇట్లు పలికెను. ఆచార్యా! ఒక బాలకిశోరము మన సేననంతటిని నాశనము చేయుచున్నాడు. మీకు కనిపించుట లేదా? అంతలో గాయపడిన కర్ణుడు ద్రోణుని వద్దకు వచ్చి తమ దుర్గతిని పేర్కొనెను. ద్రోణాచార్యుడు కర్ణునితో కర్ణ! అర్జునుడు తన కొడుకుకు అమోఘ కవచ విద్యను ప్రదానము చేసెను. అభిన్యుని వద్ద ధనుర్బాణములు రథము ఉన్నంత కాలము ముల్లోకములలో ఎవరూ అతనిని ఏమీ చేయలేరు. కనుక మొదటిగా అతని ధనుస్సును విరచి రథమును ముక్కలు చేయవలసినది. అప్పుడే నిస్సహాయుడైన బాలకుని మనం చంపగలమని పలికెను.

ద్రోణుని మాటలు విన్న కర్ణుడు అభిమన్యుని సమ్ముఖమునకు వచ్చి అతని ధనుస్సును విరగకొట్టెను. కృతవర్మ ముందుకు సాగి అతని గుఱ్ఱములను చంపెను. ఏడుగురు మహారథులు ఒంటరి బాలునిపైబాణ వర్షము కురిపించసాగిరి. కాని సాహసియగు బాలుడు క్షత్రియ ధర్మమును పాలించుచు డాలు, కత్తి తీసుకొని వారితో ఘోర సంగ్రామము చేయసాగెను. ద్రోణుడు కత్తిని, కర్ణుడు డాలును భిన్నాభిన్నము చేసిరి. అభిమన్యు దుశ్శాసన పుత్రుల పరస్పర గదా ప్రహారములచే ఇద్దరు మూర్ఛపోయిరి. మొదటగ దుశ్శాసన పుత్రునికి తెలివి వచ్చుటచే అతడు అభిమన్యుని పై గదతో దాడి చేసి చంపి వేసెను. అభిమన్యుని మరణ వార్తవిని పాండవులు విలపించిరి. సూర్యాస్తమయ మగుటచే ఇరుసేనలు తమ తమ శిబిరములకు వెడలిరి.

సంశప్తకులను వధించిన పిమ్మట అర్జునుడు సంధ్యాకాలమున శ్రీకృష్ణునితో సంభాషిస్తూ తమ శిబిరమునకు బయలుదేరెను. మార్గమున ఎడమ కన్ను, ఎడమ కాలు అదురుట, మరికొన్ని అపశకునములు అర్జునునకు కల్గినవి. మహారాజు యుధిష్ఠిరుడు పట్టుబడె నేమోయని అర్జునుడు శంకించెను. అంతట శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని బంధింపసమర్థులు ముల్లోకములలో ఎవ్వరూలేరు. మన సైన్యంలో ఎవరో వీరుడు మరణించియుండ వచ్చును అని చెప్పి అర్జునుని శీఘ్రముగా

శిబిరము వద్దకు తీసుకొని వచ్చెను. అక్కడ ఎటువంటి మంగళ వాద్యములు లేవు. అర్జునుడు కీడు శంకించి యుధిష్ఠిరుని శిబిరమునకు వెళ్ళెను. అచ్చట అందరూ శోకసముద్రములో మునిగియుండిరి. అభిమన్యుని మరణవార్తను యుధిష్ఠిరుడు తెలియజేయగా అర్జునుడు ఎంతగానో విలపించెను. శోకిస్తున్న అర్జునుని ఓదారుస్తూ శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను. అర్జునా తత్త్వజ్ఞాని అయిన నీవు ఈ విధంగా విలపించుట తగదు. అధర్మంగా అభిమన్యుడు చంపబడ్డాడన్నది దుఃఖమును కల్గిస్తోంది. దీనికి ప్రతీకారము తీర్చుకొనుట నీ ధర్మము. యుధిష్ఠిరుడు ఇట్లు పలికెను. అర్జునా నీవు సంశప్తకులతో యుద్ధము చేయుటకు వెళ్ళినపుడు ద్రోణాచార్యుడు నన్ను పట్టుకొనుటకు చక్రవ్యూహమును పన్నినాడు. చక్రవ్యూహమును భేదించుట మాకెవ్వరికీ తెలియదు. నా ఆదేశముతో అభిమన్యుడు చక్ర వ్యూహభేదనమునకు సిద్ధపడెను. భీమసేన నకుల సహదేవులు, మరికొందరు వీరులు అతనితో బాటు వెళ్ళిరి. అభిమన్యుడు లోపలికి ప్రవేశించెను. కాని జయద్రథుడు వరప్రభావముచే మమ్ములను ద్వారముదగ్గరే నిరోధించినాడు. ఎంత ప్రయత్నించినను లోపలికి వెళ్ళలేక పోతిమి. లోపల అభిమన్యుని ద్రోణ, కర్ణ, కృపాచార్య, అశ్వత్థామ, కృతవర్మ, బృహద్బల, దుర్యోధనులు మూకుమ్మడిగా
ఆక్రమించిరి. అట్టిసమయమున కూడా అభిమన్యుడు అనేక వీరులను సంహరించెను. చివరకు దుశ్శాసన పుత్రుడు మూర్ఛపోయిన అభిమన్యుని గదతో మోది చంపెను. అతని మరణమునకు ముఖ్య కారణము జయద్రథుడు. యుధిష్ఠిరుని మాటలు విన్న అర్జునుడు రేపు సూర్యాస్తమయంలోగా జయద్రథుని సంహరించెదను. అట్లుకాని యెడల ప్రాణత్యాగము చేసెదనని ప్రతిజ్ఞ చేసెను. అర్జునుని భీషణ ప్రతిజ్ఞను తెలుసుకొనిన జయద్రథుడు భయముతో దుర్యోధనుని వద్దకు వచ్చెను. జయద్రథుని ఓదార్చి దుర్యోధనుడు అతనితో కూడా ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి అర్జునుని ప్రతిజ్ఞను తెలియజేసి జయద్రథుని ప్రాణములను కాపాడుమని కోరెను. ద్రోణాచార్యుడు " నేను రక్షకునిగా ఉన్నంత కాలము జయద్రథునికి ఎట్టిహాని జరుగదు. నిశ్చింతగానుండుము." అని ధైర్యము చెప్పెను.

ద్రోణాచార్యుని ఆశ్వాసనము పొంది జయద్రథుడు నిర్భయముగా తిరుగసాగెను. శ్రీకృష్ణుడు మందహాస పూర్వముగ అర్జునునితో పార్థ! నీవు

ముందు వెనుక ఆలోచించక జయద్రథుని చంపెదనని ప్రతిజ్ఞ చేసితివి. కాని జయద్రథుని రక్షించెదనని ద్రోణుడు కూడా ప్రతిజ్ఞ చేసినాడు. జయద్రథుడు రేపటి యుద్ధమున కమలవ్యూహకర్ణికయందు ఆరుగురు మహారథులతో రక్షింపబడును. ఆసమయమున అతనినిజయించుట మిక్కిలి కష్టము అని పలికెను. అది విన్న అర్జునుడు కృష్ణా! తమ అనుగ్రహముచే నా ప్రతిజ్ఞ తప్పక నెరవేరును. మీరు ఈసమయమున సుభద్ర ఉత్తరలను ఓదార్పుడు అని శ్రీకృష్ణునికి విన్నవించెను. అంతట శ్రీకృష్ణుడు అర్జునుని శిబిరమునకు వెళ్ళి సుభద్రతో సోదరీ! నీవు, ఉత్తర ఎంత మాత్రము శోకించుట తగదు. ఏదో ఒక రోజున అందరికి మరణము తప్పనిసరి. గొప్ప గొప్ప తపోధనులు కూడా పొందని ఉత్తమ గతిని అభిమన్యుడు పొందెను. సుభద్రా! అభిమన్యుని శత్రువు జయద్రథుని చంపెదనని నీభర్త ప్రతిజ్ఞ చేసినాడు. రేపు సూర్యాస్తమయంలోపున తప్పక చంపగలడని అందరిని ఓదార్చెను. పిమ్మట శ్రీకృష్ణుడు రథసారథిని పిలిచి రేపటి యుద్ధమునకు రథమును, దివ్యాస్త్రములను సిద్ధము చేయమని ఆదేశించెను.

జయద్రథుని వధను గూర్చి ఆలోచిస్తూ అర్జునుడు కునుకు తీసెను. ఆసమయమున స్వప్నమున శ్రీకృష్ణుడు అతని దగ్గరకు వచ్చి ఇట్లు పలికెను. అర్జునా! ఏల చింతించు చున్నావు. నీప్రతిజ్ఞ తప్పక నెరవేరును. నీవు వెంటరావలసినదని చెప్పి అర్జునుని తీసుకుని శ్రీకృష్ణుడు కైలాస పర్వతము చేరెను. అక్కడ శంకరుడు కృష్ణార్జునులను సత్కరించి పిమ్మట మీకు నేనేమి చేయగలనో చెప్పుమనెను. అంతట శ్రీకృష్ణుడు పరమేశ్వరా! రేపు సూర్యాస్తమయంలోపున జయద్రథుని వధించెదనని అర్జునుడు ప్రతిజ్ఞ చేసెను. కనుక మీరు అర్జునునకు పాశుపతాస్త్రము ఇచ్చి అనుగ్రహించవలసినదని నివేదించెను. శంకరుడు వారితో మీకోరిక తప్పక నెరవేరును. ఇక్కడికి సమీపముననున్న సరోవరమున నాధనుస్సు పాశుపతాస్త్రము ఉంచితిని. అక్కడకు వెళ్ళి మీరు దానిని గ్రహింపుడని పలికెను. వారిరువురు సరోవరమును సమీపించిరి. వారికి అచ్చట రెండు సర్పములు కనబడెను. అర్జునుడు శివునికి నమస్కరించి విధివూర్వకముగా శతరుద్రీయమును పఠించెను. రెండు సర్పములు అస్త్రములుగా మారెను. వాటిని శివునకు

సమర్పించెను. అందరూ చూస్తూ ఉండగానే శివుని స్వేదమునుండి ఒక బ్రహ్మచారి వెలువడి పద్మాసనముపై కూర్చొని అర్జునునకు పాశుపతాస్త్రము ప్రయోగించు విధానము తెలియజేసెను. పరమేశ్వరుడు పాశుపతాస్త్రమును అర్జునునకు ఇచ్చెను. శంకరునకు ప్రణామమొనర్చి ఇద్దరు తిరిగి వచ్చిరి. కల పూర్తికాగానే అర్జునునకు మెలకువ వచ్చెను. ఎదురుగా శ్రీకృష్ణునిచూచి అతనికి నమస్కరించెను. పిమ్మట ఇద్దరు ఆరోజు యుద్ధమును గూర్చి చర్చించిరి. తన స్వప్నమును అర్జునుడు ధర్మరాజునకు వినిపించెను. స్వప్నము శుభసూచకమని ధర్మరాజు చెప్పెను. సాత్యకిని యుధిష్ఠిరుని రక్షించుటకు నియోగించి కృష్ణార్జునులు రథమెక్కి బయలుదేరిరి.

రాత్రి గడవగా ద్రోణుడు శకటవ్యూహమును రచించెను. వ్యూహ ద్వారము వద్ద ద్రోణా చార్యుడు నిలబడెను. ఈ వ్యూహము పదిక్రోసులవరకు విస్తరించెను. దాని వెనుక పద్మగర్భవ్యూహము రచించెను. అందు సూచిముఖమను మరియొక వ్యూహము రచించెను. సూచీమూఖవ్యూహ కర్ణికలో జయద్రథుడు దాగియుండెను. అతడు ఆరుగురు మహారథుల సంరక్షణలో నుండెను. పాండవ పక్షమున శతానీక ధృష్టద్యుమ్నులు వ్యూహాకారముగా తమసైన్యమును నిలబెట్టి యుద్ధభేరి మ్రోగించిరి. శ్రీకృష్ణార్జునులు దేవదత్తపాంచజన్య శంఖధ్వని చేసిరి.

అర్జునుని రథము శత్రుసేనవైపు ముందుకు సాగెను. అతని బాణవృష్టిచే కౌరవుల గజసైన్యము భిన్నా భిన్నమాయెను. తమసైన్యము యొక దుఃస్థితి చూచి ద్రోణుడు అర్జునునికి ఎదురుపడి ధనంజయా! నన్ను ఓడించకుండా నీవు అడుగు ముందుకు వేయలేవు. జయద్రథుని చంపలేవని పలికెను. అర్జునుడు ద్రోణునితో మీరు నాకు శత్రువుకాదు. పరమపూజ్యగురువులు. నేను మీ శిష్యుడను. పుత్రుని వంటి వాడను అని పలుకుచూ మిక్కిలి ఉత్సాహముతో కౌరవసేనలో ప్రవేశించెను. విశాల సైన్యముతో
శ్రుతాయుధుడు అర్జునుని ఎదుర్కొనెను. చూస్తూండగానే అర్జునుడు శ్రుతాయుధుని అస్త్రములను భగ్నము చేసెను.

శ్రుతాయుధుడు, శ్రతాయువుమున్నగు వీరుల మరణముతో భయపడిన దుర్యోధనుడు రథముదిగి ద్రోణుని వద్దకు పోయి ఆచార్య! మీశిష్యుడైన అర్జునునిపై దయచూపెదనని నాకు ముందే ఎందుకు

చెప్పలేదని అడిగెను. అదివిని ద్రోణుడు దుర్యోధనునితో అర్జునుని రథసారథి శ్రీకృష్ణుడు. అతని గుఱ్ఱములు వేగవంతమైనవి. శస్త్రాస్త్రవిద్యలో అర్జునుడు ఆరితేరినవాడు. ఎవ్వంత మార్గమున్నను గుఱ్ఱములు వేగముగా ముందుకు సాగిపోగలవు. నిలుపు చేయుటకు ఎంత ప్రయత్నము చేసినను సాధ్యము కాలేదు. యుధిష్ఠిరుని పట్టుకొందునని ప్రయత్నము చేసితినిగాని అర్జునుని నిరోధించుటకుగాదు. కనుక నేను సైన్యమునకు ఎదురుగా నిలబడిన ధర్మరాజును పట్టిచూపెదను. నీవు అర్జునుని రెండు క్షణములు అడ్డగించుమని చెప్పెను. అర్జునుని ఎదుట ఒక్కక్షణము కూడా నేను నిలువలేనని దుర్యోధనుడు చెప్పగా ద్రోణాచార్యుడు రాజా! నీవు ఎంతమాత్రము భయపడవద్దు. శంకరునిచే ఈయబడిన అభేద్యకవచమును నీకు ధరింపజేసెదను. దేవ, దానవ, గంధర్వాదులెవ్వరూ దీనిని భేదించలేరని చెప్పి అభేద్యకవచమును ధరింపజేసి దుర్యోధనుని అర్జునునితో యుద్ధము చేయుటకు పంపెను. గుఱ్ఱములు మిక్కిలి శ్రమపడి యుండుటను గమనించి అర్జునుడు శ్రీకృష్ణునితో మన అశ్వములు అలసిపోయినవి. జయద్రథుడు ఇంకను దూరంగా ఉన్నాడు. మీరు నిశ్చింతగా అశ్వములను విశ్రమింపజేయుడు. నేను శత్రుసైన్యమును నిలుపు చేసెదనని చెప్పి బాణములతో గృహము నిర్మించెను. శ్రీకృష్ణుడు గుఱ్ఱములను విశ్రమింపజేయుటకు అచ్చటకు తీసుకుని వెళ్ళెను.

శ్రీకృష్ణుడు అర్జునునితో పార్థ! గుఱ్ఱములు దప్పికతో నున్నవి. వీనికి జలవ్యవస్థను చేయుమని చెప్పెను. అర్జునుడు. బాణముతో భూమిని చీల్చి సుందర జలాశయమును నిర్మించెను. గుఱ్ఱములు విశ్రాంతి పొందిన పిమ్మట రథమునకు కట్టి అర్జునుని రథముపై కూర్చుండ బెట్టి శ్రీకృష్ణుడు ముందుకు సాగెను. జయద్రథుడు కంటపడగానే ఇరువురు హర్షధ్వనులు చేసిరి. ఇంతలో అభేద్యకవచమును ధరించిన దుర్యోధనుడు వీరికి ఎదురుగా వచ్చెను. విషయమును గ్రహించిన అర్జునుడు తీవ్రబాణములతో అతని చేతి వ్రేళ్ళను గాయపరచి సారథితో సహా అశ్వములను వధించెను. కలత చెందిన దుర్యోధనుడు యుద్ధభూమినుండి వెనుదిరిగెను. భీమ అలంబుషుల మధ్య ఘోరయుద్ధము జరిగెను. అలంబుషుడు భీముని గాయపరిచెను. ఇంతలో కోపగించిన
భీమపుత్రుడు ఘటోత్కచుడు అతనిని ఎదుర్కొనెను. అలంబుషుడు

ఘటోత్కచుని రథమును నష్టము చేసెను. క్రుద్ధుడైన ఘటోత్కచుడు రథమునుండి ఉరికి అతని శరీరమును భిన్నాభిన్నము జేసెను. అలంబుషుని మరణంతో కౌరవసేనలో హాహాకారములు చేలరేగెను.

ఉదయము నుండి అర్జునుని సమాచారము తెలియకపోవుటచే యుధిష్ఠిరుడు మిక్కిలి చింతించి సాత్యకిని తెలుసుకుని రమ్మని చెప్పెను. అప్పుడు సాత్యకి రాజా! శ్రీకృష్ణార్జునులు నన్ను తమ రక్షణకై నియోగించినారు. తమ ఆదేశము శిరోధార్యము. ద్రోణుడు మిమ్ములను బందీగా పట్టుకొనుటకు ప్రతిజ్ఞచేసినాడు. కనుక మీరు జాగ్రత్తగా నుండ వలసినదని చెప్పి కొద్దిపాటి సైన్యముతో యుద్ధభూమికి బయలుదేరెను. సాత్యకిని యెదుర్కొన్న కృతవర్మ సాత్యకి పరాక్రమంముందు ఎక్కువకాలం నిలువ లేక గాయపడి పారిపోయెను. ఈ కారణంచే సాత్యకికి ఆలస్యమైనది. యుధిష్ఠిరుడు చింతతో భీముని పిలిచి సోదరా! ఉదయమునుండి అర్జునుని సమాచారము తెలియుటలేదు. సాత్యకిని పంపినను ఇంతవరకు అతని జాడలేదు. కనుక నీవు అర్జునుని క్షేమసమాచారమును నాకు చేరవేయుమని చెప్పెను. సోదరుని వ్యాకులతను గమనించిన భీముడు యుధిష్ఠిరుని రక్షణభారమును ధృష్టద్యుమ్నునికి అప్పగించి గద, ధనుర్బాణములను తీసుకొని సింహనాదం చేస్తూ యుద్ధభూమికి వెడలెను. ద్రోణుడు తన బాణములతో భీముని మార్గమును అడ్డగించెను. అంతట భీముడు రథముదిగి రథముతో సహ ద్రోణుని చాలా దూరము విసిరివేసెను. ఎదురుపడిన కర్ణుని ఓడించి అర్జునుని సమీపించెను. జయద్రథుడు భీమ,అర్జున,సాత్యకులను ఒక్కచోట చూసి భయపడి చావు తప్పదని తలపోసెను.

ఇట్టి పరిస్థితిని గమనించిన దుర్యోధనుడు పరిగెత్తుకుంటూ ద్రోణుని వద్దకు వెళ్ళి విషయమంతా చెప్పి జయద్రథుని రక్షించు భారము మీదే యని వేడుకొనెను. దుర్యోధనుని చింతను గమనించి ద్రోణుడు దుర్యోధనా! మనము జయద్రథుని తప్పక రక్షించ వలెను. కనుక నీవు ఆముగ్గురు యోద్ధలతో యుద్ధము చేయుమని చెప్పెను. ద్రోణుని మాటలు విన్న దుర్యోధనుడు జయద్రథుని రక్షించుభారము తనపైనున్నదని తెలుసుకొని తక్షణము అర్జునుని సమీపించెను. భీమునిచే ఒకసారి పరాజితుడైన కర్ణునికి రక్షణగా తనసోదరుడు దుర్జయుని పంపెను. తక్షణమే భీముడు దుర్జయుని చంపి కర్ణుని రథమును ముక్కలు చేసెను.

భీముని అద్భుత పరాక్రమము చూచి కర్ణుడు బెదరి రథములో ఒకమూల దాగి
తనను తాను రక్షించుకొనుటకు ప్రయత్నించెను. అంత భీముడు కర్ణుని రథమునెక్కి అతనిని క్రిందకు ఈడ్చెను. కర్ణుడు తీవ్రబాణములతో భీముని మూర్ఛ పోవునట్లు చేసెను. కాని కుంతిమాటలను తలచుకొని భీముని చంపక వదలెను. భీముడు సాత్యకి రథమునెక్కి అర్జునుని దగ్గరకు వచ్చెను. సాత్యకి భీములను చూచి అర్జునునకు యుధిష్ఠిరుని చింత కల్గెను. యుద్ధమున భూరి శ్రవసుడు సాత్యకిని నేలమీద పడగొట్టి చంపుటకు సిద్ధపడెను. శ్రీకృష్ణుని సూచననుసరించి అర్జునుడు వెంటనే భూరిశ్రవసుని భుజములను నరికివేసెను. ఇది చూచి అందరూ అర్జునుని నిందించసాగిరి. భూరిశ్రవసుడు సాత్యకినివిడిచి మరణ పర్యంతము ఉపవాసము చేయుటకు సంకల్పించెను. సాత్యకి కత్తితో భూరిశ్రవసుని శిరస్సు ఖండించెను. సాత్యకి చేసిన పనిని కౌరవులు నిందించిరి.

అటుపిమ్మట శ్రీకృష్ణుడు రథమును జయద్రథుని వైపు మరల్చెను. జయద్రథ అర్జునుల మధ్య ఘోర సంగ్రామము జరుగసాగెను. జయద్రథుని పక్షమున అరుగురు మహారథులు యుద్ధము చేయుటకు వచ్చిరి. సూర్యాస్తమయమగుటకు కొద్ది సమయముమాత్రము మిగిలియున్నది. కనుక కౌరవులు ఎంతో నిబ్బరంతో పోరాడసాగిరి.
కృష్ణుడు అర్జునునితో పార్థ! మహారథులు జయద్రథుని చంపుట సాధ్యముకాదు. సూర్యాస్తమయం కావచ్చుచున్నది. ఇప్పుడు మనముందు ఉన్నది ఒక్కటే ఉపాయము. నేను మాయతో సూర్యుని ఆచ్ఛాదన చేసెదను. సూర్యాస్తమయం అయిందనుకొని జయద్రథుడు నిర్భయంగా బయట తిరుగుతాడు. ఆక్షణమున అతనిని చంపవలసినది. తిరిగి సూర్యోదయం కాగలదు. జయద్రథుని చంపుటకు ఇంత కంటె వేరే ఉపాయము కనబడుట లేదని చెప్పెను. అర్జునుడు దాని కంగీకరించెను. శ్రీకృష్ణుడు యోగమాయతో సూర్యుని ఆచ్ఛాదన చేసెను. అందరూ సూర్యాస్తమయం అయినదని అనుకొనిరి. అంతట అంధకారము అలుముకొనుటచే జయద్రథుడు సంతోషంతో బయటకు వచ్చి అర్జునునితో మరణించుటకు అన్ని ఏర్పాట్లు చేసుకోవలసినదని పేర్కొనెను. శ్రీకృష్ణుడు అర్జునునితో సింధురాజు ఇంకను సూర్యుని వైపు చూచుచున్నాడు. ఇప్పటికి సూర్యాస్తమయం కాలేదు అతని చంపుము. తెగిన అతని శిరస్సు

నేలమీద పడకూడదు. ఎందు వల్ల ననగా ఇతని తండ్రి విశ్వవిఖ్యాత వృద్ధక్షత్రుడు. ఆకాశవాణి అతనికి రాజా! నీ పుత్రుడు కులశీలసంపన్నుడు. కాని ఒకరోజున యుద్ధమున ఇతరక్షత్రియులు నీపుత్రుని శిరస్సును ఖండించెదరని వెంటనే అతనిని నరికిన వాని తల వేయి ముక్కలుకాగలదని చెప్పి జయద్రధుని
రాజ్యమప్పగించి తపోవనమునకు వెడలెను. ఇప్పుడు సమంత పంచక క్షేత్రమున జయద్రధుని తండ్రి తపస్సు చేయు చున్నాడు. కనుక నీవు దివ్యాస్త్రముతో జయద్రధుని శిరస్సును ఖండించి అతని తండ్రి ఒడిలో పడునట్లు చేయుమని చెప్పెను. అర్జునుడు అట్లే చేసెను. పుత్రుని శిరస్సు జపములో నిమగ్న మైన తండ్రి ఒడిలో పడెను. జపము పూర్తి అయిన తరువాత వృద్ధక్షత్రుడు లేవగానే ఒడి నుండి శిరస్సు నేలపై పడెను. అతని తలముక్కలాయెను. జయద్రధుని వధ జరిగిన పిమ్మట. శ్రీకృష్ణుని మాయచే కలిగిన చీకటి తొలగెను. కౌరవులందరూ విచారించిరి.

పిమ్మట కృష్ణార్జునులు సాత్యకిభీములతో యుధిష్ఠిరుని వద్దకు వచ్చిరి. ధర్మరాజు అర్జునుని కౌగలించు కొని కృష్ణుని స్తుతించెను. సంజయుడు ధృతరాష్ట్రునితో రాజా! జయద్రధుని మరణముతో కౌరవసేన దుఃఖములో మునిగినది. రోదిస్తూ దుర్యోధనుడు ద్రోణుని వద్దకు వచ్చి ఇట్లు పలికెను. ఆ చార్య! ఈ రోజు అర్జునుడు మన ఏడు అక్షౌహిణుల సేనను నాశము చేసినాడు. జయద్రధుని చంపినాడు. మీరు తలచినట్లైతే జయద్రధుని వధ జరిగి యుండేది గాదు. బహుశః మీరు మాకు సహాయము చేయుటకు ఇష్టపడుట లేదు. దుర్యోధనుని ఎత్తి పొడుపు మాటలువిని ద్రోణాచార్యుడు దుర్యోధనా! నీవు ఎల్లప్పుడు వ్యంగ్యబాణములతో నన్నుబాధిస్తున్నావు. అర్జునుని జయించువాడు ముల్లోకములలో ఎవ్వరూ లేరన్న సంగతి నీకు తెలియదు. శకుని ద్వారా పాచికలు వేయించి అధర్మముగా పాండవులను జయించుటకు ఇది ద్యూత క్రీడ కాదు ఇది యుద్ధము. యద్ధమున పాండవులను జయించుట అంతసులభము కాదు. నేను కూడా మృత్యువుకు దగ్గరలోనే ఉన్నాను. అయినప్పటికి మరణపర్యంతము నాకర్తవ్యమును నిర్వహించగలనని చెప్పి వెళ్ళిపోయెను. అప్పుడు దుర్యోధనుడు కర్ణునితో ద్రోణాచార్యుడు హృదయపూర్వకముగ యుద్ధము చేయుట లేదు. కనుకనే అర్జునుడు

వ్యూహంలో ప్రవేశించగలిగాడు. జయద్రథుడు చంపబడ్డాడని పలికెను. అదివిని కర్ణుడు రాజా! నీవు ఆచార్యునిపై మిధ్య అయిన నిందవేయుచున్నావు. నీవు చేసిన పాపము, అత్యాచారము రెండును కలసి నిన్ను నాశముచేయు చున్నవి. జరిగేది జరుగుతుందని చెప్పి యుద్ధమునకై వెడలెను. ఆరాత్రి ఇరుపక్షముల మధ్య ఘోర యుద్ధము జరిగెను. భీముడు రెచ్చిపోయి శత్రుసైన్యమును సంహరించెను. అశ్వత్థామను సాత్యకి ఎదుర్కొనెను. సాత్యకి గాయపడగా ఘటోత్కచుడు అక్కడకు వచ్చెను. అశ్వత్థామ ధాటికి ఘటోత్కచుడు నేలమీద పడెను. ఘటోత్కచుడు మరణించాడని అనుకొని పాండవసేన వెనుదిరిగెను.

ద్రోణుని చంపుటకు పాండవులు నాల్గు వైపుల అతనిని ముట్టడించిరి. భీమార్జునులను నిలుపు చేయుటలో ద్రోణుడు నిష్ఫలుడాయెను. ద్రోణుని రక్షించమని దుర్యోధనుడు కర్ణునికి చెప్పెను. అర్జునునితో సహా పాండవులందరిని మట్టి కరిపించెదనని కర్ణుడు రోషపూర్వకముగా మాట్లాడెను. అర్జునుని చేతిలో నీవు ఎన్ని సార్లు భంగపడలేదని కృపాచార్యుడు కర్ణుని ఎగతాళి చేసెను. అంతట కర్ణుడు కృపాచార్యుని నోరు సంబాళించు కొని మాట్లాడుమని హెచ్చరించెను. కృపాచార్యునికి జరుగుచున్న అవమానమును సహింపలేక అశ్వత్థామ కర్ణుని చంపుటకు సిద్ధపడెను. కాని దుర్యోధనుడు వారిద్దరిని శాంతపరచెను. దీపముల వెలుగులో యుద్ధం చేస్తూ చేస్తూ అర్థరాత్రి గడిచెను. సంజయుడు ధృతరాష్ట్రునితో రాజా! భీమ, అర్జున, ఘటోత్కచులధాటికి కౌరవసైన్యము నశించుచుండగా దుర్యోధనుడు కర్ణుని ఏదో ఒకటి చేయమని వేడెను. అది విన్న కర్ణుడు ద్రోణుని రక్షించుటకు అతని వద్దకు చేరెను. అర్జునుని రథము ద్రోణుని సమీపించెను. కర్ణుని ధాటికి నిలువలేక పాండవసైన్యము పారిపోసాగెను. అప్పుడు ధర్మరాజు కర్ణవధకు ఉపాయము ఆలోచించమని అర్జునుని కోరెను. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునా! కర్ణుని నీవు లేక ఘటోత్కచుడు ఇద్దరే చంపగలరు. ఈ రాత్రి నీవు కర్ణునితో యుద్ధమొనర్చి సాత్యకి సహాయంతో అతనిని చంపుమని అర్జునునికి చెప్పెను. అంతట ఘటోత్కచుడు నేనొక్కడినే కర్ణుని చంపుటకు చాలునని చెప్పి బయలుదేరెను. ఘటోత్కచుడు కర్ణుని చంపుటకు వస్తున్నాడని తెలుసుకొని దుర్యోధనుడు కర్ణునికి సహాయముగా దుశ్శాసనుని పంపెను. అంతట జటాసుర పుత్రుడు రెండవ అలంబుషుడు

దుర్యోధనునితో రాజా! నా తండ్రిని చంపిన ఘటోత్కచునిపై ప్రతీకారము తీర్చుకొందునని చెప్పి ఘటోత్కచునితో యుద్ధమునకు దిగెను. ఘటోత్కచుడు అతని శిరస్సును ఖండించి దుర్యోధనుని రథముపైకి విసిరెను. ఘటోత్కచ కర్ణుల మధ్య ఘోర సంగ్రామము జరుగసాగెను. కర్ణుడు మహావీరుడైనప్పటికి రాత్రి సమయమగుటచే రాక్షసమాయ అధికముగానున్నది. కర్ణుని ఘటోత్కచుడు బాణ వర్షముతో బాధించసాగెను. మధ్యలో వచ్చిన అలాయుధుడను రాక్షసుని చంపి ఘటోత్కచుడు అతనిని దుర్యోధనుని రథముపైకి విసిరి వేసెను. కర్ణుడు ఎంత మాత్రము ఘటోత్కచుని ఎదుర్కొన లేక పోయెను. కౌరవులు ఘటోత్కచుని త్వరగా చంపుము. మనసైన్యము నష్టమగుచున్నదని కర్ణుని అడిగిరి. అతడు ఘోరసంకటములో పడెను. అర్జునుని వధనిమిత్తం దాచుకొన్న ఇంద్రశక్తిని గత్యంతరము లేక ఘటోత్కచునిపై ప్రయోగించి అతనిని చంపెను. ఘటోత్కచుని చంపి శక్తి తిరిగి
ఇంద్రుని చేరినది.

సంజయుడు ధృతరాష్ట్రునితో రాజా! ఘటోత్కచుని మరణముతో పాండవులలో విషాదము నెలకొన్నది. కాని శ్రీకృష్ణుడు ఎంతో ప్రసన్నముగా నుండుటను చూచి అర్జునుడు మాధవ! ఘటోత్కచుని మరణము వలన మీరు ఇంత ప్రసన్న మగుటకు కారణమేమని శ్రీకృష్ణుని ప్రశ్నించెను. ఇంద్రునిచే ఈయబడిన వైజయంతి శక్తిని కర్ణుడు నిన్ను చంపుటకు సురక్షితముగా ఉంచుకున్నాడు. ఆకారణముచే కర్ణునికి ఎదురుపడకుండా నిన్ను నిరోధించాను. నా రాజనీతి నీకు తెలియదు. ఘటోత్కచుడు మరణించి నిన్ను అమరుని చేశాడని శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పి రథమును కర్ణునికి ఎదురుగా నిలిపెను.

ధృతరాష్ట్రుడు సంజయా! అర్జునుని వధనిమిత్తం దాచిన అమోఘమైన శక్తిని కర్ణుడు ముందే ఎందుకు ప్రయోగించలేదని సంజయుని ప్రశ్నించెను. సంజయుడు ధృతరాష్ట్రునితో రాజా! కర్ణుడు అర్జునునితో యుద్ధము చేసి తిరిగి వచ్చిన ప్రతీసారి కౌరవులు ఇట్లే ప్రశ్నించెడివారు. దానికి సమాధానంగా కర్ణుడు శ్రీకృష్ణార్జునులు నాకు ఎదురుపడినప్పుడు కారణమేమోగాని ఆ శక్తి నాకు గుర్తుకు వచ్చెడిది కాదని చెప్పెడి వాడట. అమోఘమైన శక్తిని నిష్ఫలము చేయుటకై

శ్రీకృష్ణుడు కర్ణునిపైకి ఘటోత్కచుని పంపెనని చెప్పెను. పిమ్మట అర్జునుని సూచననుసరించి ఆరాత్రి చంద్రోదయము వరకు యుద్ధ విరామము ప్రకటించి ఇరుపక్షములు తమ తమ శిబిరములకు వెడలి నిద్రపోయినవి. దుర్యోధనుడు ద్రోణాచార్యునితో ఆచార్య! శత్రుసేన నిద్రపోవుచున్నపుడు నాశము చేయవలెనని చెప్పెను. అది విన్న ద్రోణుడు దుర్యోధనునితో నేను వృద్ధుడనైతిని. అయినను అటువంటి అధర్మమును నేను చేయను. అయినప్పటికి నీ ఆజ్ఞను పాలించెదనని చెప్పి అర్జునుని ప్రశంసించెను. అంత దుర్యోధనుడు కోపంతో ఈరోజు నేను. దుశ్శాసన కర్ణ శకునులు కలిసి కౌరవసేనను రెండు భాగములుగా చేసి అర్జునుని చంపెదమని ప్రగల్భములు పలికెను. దుర్యోధనుని మాటలకు నవ్వుకొని ద్రోణాచార్యుడు అతని ప్రస్తావనను అంగీకరించెను. చంద్రోదయమయిన వెంటనే తిరిగి యుద్ధమారంభయాయెను.

ద్రోణుడు ద్రుపదుని పౌత్రులను, ద్రుపదుని, విరాటుడు మున్నగువారిని సంహరించెను. తన తండ్రి వధకు ప్రతీకారము తీర్చుకొనుటకు సిద్ధపడి ధృష్టద్యుమ్నుడు ద్రోణుని చంపదలచెను. ద్రోణుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించగా అర్జునుడు తన బ్రహ్మాస్త్రముతో దానిని శాంతింపజేసెను. ద్రోణార్జునుల మధ్య భీషణ యుద్ధము జరిగెను. కుంతీపుత్రులు భయపడుటను గమనించి శ్రీకృష్ణుడు ఇట్లు చెప్పెను. ద్రోణాచార్యుడు శ్రేష్ఠ ధనుర్ధారి. అతని చేతిలో ధనుర్బాణములున్నంత కాలము అతనిని ఎవ్వరూ ఓడించలేరు. అతడు అస్త్రత్యాగము చేసిన సాధ్యము. అశ్వత్థామ మరణవార్త వినినచో అతడు అస్త్రత్యాగము చేయగలడు. కనుక ఎవరైన అశ్వత్థామ మరణించినట్లు సమాచారమందించిన ద్రోణుడు అస్త్రసన్యాసము చేయగలడు. వెను వెంటనే భీముడు తమసైన్యములోని సింహనాదము చేసెను. ద్రోణునికి భీముని మాటలపై విశ్వాసము కలుగక యుధిష్ఠిరుని వద్దకు వెళ్ళెను. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునికి విషయమంతా ముందే చెప్పెను. యుధిష్ఠిరుడు గట్టిగా అశ్వత్థామ చంపబడ్డాడని చెప్పి మెల్లగా కాని అది ఏనుగు అని అనెను. సత్యవాది ధర్మరాజు వలన ఆమాటలు విన్న ద్రోణుడు సమాధ్యవస్థను పొందెను. అప్పుడు ధృష్టద్యుమ్నుడు అతని శిరస్సు ఖండించెను. తన తండ్రి వధకు ప్రతీకారము తీర్చుకొనుటకు అశ్వత్థామ నారాయణాస్త్రమును ప్రయోగించెను. ద్రోణాచార్యుని అన్యాయపూర్వక

వధను గూర్చి వార్తాలాపము జరుపుచుండగా నారాయణాస్త్రము అగ్ని జ్వాలలు కక్కుచు పాండవసేన వైపు దూసుకు వచ్చెను. పాండవసేన భయపడి పారిపోవ సాగెను. అదిచూచి శ్రీకృష్ణుడు వీరులందరిని ఆయుధములు నేలపై ఉంచి రథము క్రింద దాగు కొనుడు. అస్త్రములు లేని వారిని నారాయణాస్త్రము ఏమీ చేయదు. అస్త్రములతో ఎదురు వెళ్ళువానిని మాత్రము సంహరించునని పలికెను. శ్రీకృష్ణుని మాటలు విని వీరులందరు తమ అస్త్రములను విడిచి పెట్టిరి. కాని భీముడు తన బాణములతో నారాయణాస్త్రమును నివారించెదను. వీరులార! అస్త్రత్యాగము చేయవలసిన పని లేదని చెబుతూ ఒంటరిగా అశ్వత్థామకు ఎదురు వెళ్ళెను. అప్పుడు శ్రీకృష్ణార్జునులు పరుగెత్తుకుంటూ వెళ్ళి భీముని రథము క్రిందకు లాగిరి. భీముడు తన అస్త్రములను క్రింద పడవేసెను. నారాయణాస్త్రము శాంతించుటను చూచి అశ్వత్థామ ఆశ్చర్యపోయెను.

దుర్యోధనుడు అశ్వత్థామను తిరిగి నారాయణాస్త్రము ప్రయోగించమని కోరెను. కాని అది ఒక్కసారే ప్రయోగించగలము. రెండవ సారి ప్రయోగించిన నన్నే చంపగలదని అశ్వత్థామ సమాధానము చెప్పెను. అర్జునుడు అశ్వత్థామపై బాణ వర్షము కురిపించెను. అశ్వత్థామ ఆగ్నేయాస్త్రమును ప్రయోగించెను. అర్జునుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించి దానిని శాంతింపజేసెను. శ్రీకృష్ణార్జునులకు ఎటువంటి నష్టము జరుగక పోవుటను చూచి అశ్వత్థామ ఖిన్నుడై శస్త్రాస్త్రములను విసిరి వేసి యుద్ధభూమినుండి వెడలెను. అప్పుడు వ్యాసమహర్షి ప్రత్యక్షమై శ్రీకృష్ణార్జునులు నరనారాయణుల
అవతార పురుషులు. కనుక ఏ అస్త్రశస్త్రము వారిని ఏమీ చేయలేదు. వ్యర్థముగా చింతించకుమని ఓదార్చెను. అశ్వత్థామ మనస్సులో శ్రీకృష్ణునికి నమస్కరించి తమ సేనతో శిబిరమునకు తిరిగి వచ్చెను.

**ఇది ద్రోణపర్వ కథాంశము.**